క్లుప్తంగా

24న ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ

పెదపూడి: జి.మామిడాడ గ్రామం పాటి మీద ఈ నెల 24న శ్రీమాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం తెలిపారు. ప్రతిష్ఠా కార్యక్రమాల్లో భాగంగా 20వ తేదీ నుంచి ఆలయంలో సంకల్ప పూజలు నిర్వహిస్తారన్నారు. 21న గ్రామంలో ధ్వజ స్తంభాన్ని ఊరేగిస్తామన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



తొస్సిపూడిలో గ్రామోత్సవం చేస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడిలో నూతనంగా నిర్మించిన పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22న ప్రతిష్ఠించనున్న స్వామివారి విగ్రహాలను సోమవారం గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద గణపతి పూజ, క్షీరాభిషేకం, జలాధివాసం, హోమాలు జరిపారు. పూజల్లో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి, ఉపసర్పంచ్ దార్వంపూడి వీర వెంకటరెడ్డి, ఎంపీటీసీ తేతలి సుమ, ఆలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

రంగంపేట: స్త్రీలను గౌరవించడం, మాతృభావన, దేశభక్తి విషయంలో విద్యార్థులు ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ అధ్యక్షుడు ఎం.సాయిరాం అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో జరిగిన శివాజీ జయంతోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.హేమ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథిలు శివాజీ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బి.విజయ్‌ప్రసాద్, ఎం.గుప్తా, వై.నాగేంద్ర, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

బిక్కవోలు: వలంటీర్ల సేవలు అభినందనీయమని సర్పంచ్ బుంగా రామారావు అన్నారు. సోమవారం బలభద్రపురంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా పలువురు వలంటీర్లకు సేవ వజ్ర, సేవా మిత్ర పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ల సేవలను గుర్తించిన ప్రభుత్వం భవిష్యత్తులో వారికి మరింత మేలు చేకూర్చేలా కార్యచరణ రూపొందించిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్, ఉప సర్పంచ్ నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవాదళ్ కార్యదర్శిగా ఈశ్వరరావు



రాజానగరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కమిటీ కార్యదర్శిగా పుణ్యక్షేత్రానికి చెందిన పేపకాయల ఈశ్వరరావు నియమితులయ్యారు. అనుబంధ కమిటీల నియామకాలలో భాగంగా ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సూచనల మేరకు ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు ఈశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఆయనకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా రాబోయే ఎన్నికలలో పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ

మధురపూడి: వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్టు టీడీపీ నాయకుడు బర్ల బాబూరావు తెలిపారు. కోరుకొండలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 1.55 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన ఓటర్లుండగా ఎమ్మెల్యే సీటును బలహీన వర్గాలకు కేటాయించకపోవడాన్ని తప్పుపట్టారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంత్యుత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఛత్రపతి శివాజీ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ శివాజీ పరిపాలనా విశేషాలను, మరాఠాలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సంపాదించడానికి ఆయన చేసిన వీరోచిత పోరాటాన్ని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.హరేరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులందరూ శివాజీ ద్వారా స్ఫూర్తిని పొందాలని ప్రేరేపించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా.. సీఎం జగన్ పాలన

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- రూ.1.15 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం



అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు

అనపర్తి: ప్రజా సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అజెండా అని, సీఎం జగన్ పాలన సంక్షేమానికి చిరునామాగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కుతుకులూరులో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయం–1 భవన సముదాయాన్ని, రూ.21.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో రూ. 37 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగనన్నతోనే సాధ్యమైందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను మరింత వేగంగా, పూర్తి పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రజలకు అందించేందుకు తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థతో గ్రామ స్థాయి నుంచే పరిపాలన సాగుతోందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి ఈ ఐదేళ్లలో గ్రామాల్లో కంటికి కనబడుతోందని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, దీనికి టీడీపీ నాయకులు మాత్రం బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న జనరంజక పాలనతో టీడీపీ నేతల రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. ఈ అక్కసుతోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మంచి చేసే ప్రభుత్వానికి ప్రజలు తమ మద్దతును అందించి, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందించాలని కోరారు.

అన్నదాతలకు సత్వర సేవలు

రైతుల ప్రయోజనాలను అనుగుణంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు గ్రామస్థాయిలోనే అన్ని రకాల సేవలు సత్వరంగా, పూర్తి స్థాయిలో అందించేందుకు కృషి చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. మండలంలోని కుతుకులూరులో రూ.31 లక్షలతో నిర్మించిన సొసైటీ భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార పరపతి సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా రైతులకు మరిన్ని సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, ఉపసర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, సత్తి సూరారెడ్డి బ్రదర్స్ పాల్గొన్నారు.

కల్యాణ కొబ్బరి బొండాలు సిద్ధం



పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో మంగళవారం జరగనున్న సూర్యనారాయణమూర్తి కల్యాణంలో వినియోగించేందుకు వ్యాయామ ఉపాధ్యాయుడు, సూక్ష్మ కళాకారుడు డి.యువరాజారెడ్డి కొబ్బరి బొండాలను సిద్ధం చేశారు. శంకు, చక్ర, నామాలు అలంకరించిన కల్యాణ కొబ్బరి బొండాలను గత 15 ఏళ్లుగా స్వామి వారికి సమర్పిస్తున్నట్లు ఆయన సోమవారం తెలిపారు.

ఆంజనేయుని ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



ఎమ్మెల్యే రాజాను కలుసుకున్న పంచాయతీ కార్యదర్శులు

రాజానగరం: మండలంలోని పుణ్యక్షేత్రంలో సుమారు రూ.రెండు కోట్లతో నిర్మించే భక్తాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ ఆలయ ప్రాంగణంలోనే వినాయకుడు, శ్రీకృష్ణుడు, మహాలక్ష్మి ఆలయాలతో పాటు శివాలయాన్ని కూడా నిర్మించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల హర్షం

రాష్ట్రంలోని గ్రేడ్–5లో ఉన్న పంచాయతీ కార్యదర్శులకు డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లుగా (డీడీఓ) పదోన్నతులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంపై మండలంలోని గ్రేడ్ – 5 పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాను రాజమహేంద్రవరంలోని ఆయన స్వగృహం వద్ద సోమవారం కలుసుకున్నారు. ఆయన ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సీతానగరం మండల ప్రగతిపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు పలు అంశాలను వివరించారు. హౌసింగ్ ఏఈ రామారావు మాట్లాడుతూ జగనన్న కాలనీలో నిర్మించుకున్న ఇళ్లకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు మాట్లాడుతూ వారంలో ఒకరోజు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహి స్తున్నామని, పేదలైన రోగులకు వైద్యసేవలు అందజేస్తున్నామన్నారు. మండలంలో దాదాపు అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశామని తెలిపారు. హార్టికల్చర్ అధికారి మాట్లాడుతూ ఉద్యానవన పంటలకు ప్రభుత్వం నుంచి సహకారం ఉందని, అరటి, బొబ్బాయి వంటి పండ్ల తోటలకు నష్టం జరిగితే పరిహారం అందుతుందన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో ఝాన్సీ మాట్లాడుతూ మండలంలో 15 అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, వైస్ ఎంపీపీ – 2 సత్యం మదన్ బాబు, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, ఏపీవో నాగేశ్వరి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



ఏఎంసీ కార్యాలయంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) కార్యాలయంలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఏఎంసీ కార్యాలయం చుట్టూ ప్రహరీ, బోర్ వెల్ పనులకు కృష్ణారెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ పరిధిలోని వివిధ గ్రామాల్లో పుంత రోడ్ల అభివృద్ధికి గాను అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి బి.రవికుమార్, పొలమూరు ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి, ఏఎంసీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజా కార్యక్రమాలు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో పునర్నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయశాఖ కార్యనిర్వహణాధికారి శివ ఆధ్వర్యంలో బుధవారం హనుమత్, లక్ష్మణ, సీతా సమేత రామచంద్రమూర్తుల విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. ఈ నేపథ్యంలో కనగర్ల వెంకప్ప శ్రేష్ఠి దంపతులతో పండితులు పూజలు నిర్వహించారు. రామాలయ ప్రధాన అర్చకుడు రమేష్, విష్ణాలయం అర్చకుడు నాగార్జున శర్మ, భక్తులు పాల్గొని విష్ణాలయంలో 21 రోజులు పూజలు, జపాలు చేసిన ప్రతిష్ఠ యంత్రాలను యాగశాలకు తీసుకువచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గౌతమ బుద్ధుని చిత్రానికి అవార్డు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడికి చెందిన చిత్రకారుడు కన్నాబత్తుల రామ్మోహనరావు గీచిన గౌతమ బుద్ధుని చిత్రానికి ఆర్ట్ లెజెండ్ అవార్డు దక్కింది. అమరావతిలోని విజ్ఞాన్ మందిరంలో ఇటీవల ఇండియన్ ఆర్ట్స్ ఫెస్టివల్ జరిగింది. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన రామ్మోహనరావును నిర్వాహకులు సత్కరించారు. న్యాయనిర్ణేతలుగా హైకోర్టు న్యాయమూర్తి గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ తదితరులు వ్యవహరించారు.

సూర్యదేవుని కల్యాణ ఏర్పాట్లపై సమీక్ష



కల్యాణ ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ శోభన్‌కుమార్

పెదపూడి: జి.మామిడాడలో మంగళవారం జరగనున్న సూర్యనారాయణమూర్తి స్వామివారి కల్యాణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలతో సోమవారం ఆలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ కల్యాణానికి వచ్చే భక్తుల కోసం మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అడిగారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులను ఎక్కువసేపు ఆలయ ప్రాంగణంలో ఉండకుండా త్వరగా పంపించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్‌ఐ శోభన్‌కుమార్ మాట్లాడుతూ కాకినాడ నుంచి పెదపూడి, జి.మామిడాడ మీదుగా బిక్కవోలు వైపునకు వెళ్లే వాహనదారులు పెద్దాడ గ్రామంలోని గండ్రేడు సెంటర్ నుంచి బిక్కవోలు వెళ్లాలన్నారు. అలాగే బిక్కవోలు నుంచి కాకినాడ వెళ్లే వాహనాలు వేట్లపాలెం మీదుగా వెళ్లాలని చెప్పారు. కల్యాణోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఆలయ ఈఓ మురళీ వీరభద్రరావు, ఏఎస్‌ఐ శ్రీనివాస్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలి

ఎంపీపీ కేతా తులసి



పెదపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా తులసి

పెదపూడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్లు, ఉన్నత అధికారులు నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ పర్యవేక్షించాలని ఎంపీపీ కేతా తులసి అన్నారు. పెదపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తులసి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ తులసి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా లేదంటూ, పిల్లల హాజరు శాతం తక్కువగా ఉందంటూ ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధుల సమక్షంలో సూపర్‌వైజర్లు తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి సీడీపీఓ జ్యోతి అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు వివరిస్తుండగా ప్రజాప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలపై ఆమె సమాధానం చెప్పారు. ఎంపీటీసీ సభ్యులు పేపకాయల వెంకటరమణ, సుందరపల్లి సుధాకర్‌బాబు, శ్రీరామచంద్రమూర్తి, పుట్టకొండ సర్పంచ్ వల్లు వెంకటరమణ మాట్లాడుతూ శహపురం గ్రామంతో పాటు ఇతర గ్రామాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కుక్క, పాము కాటులకు గురవుతున్నవారికి సకాలంలో వైద్యం అందేలా చూడాలన్నారు. సంపర, కాండ్రేగుల, పుట్టకొండ గ్రామాల్లో సాగునీరు సక్రమంగా అందడం లేదని ఆయా శాఖాధికారులను నిలదీశారు. ఎంపీపీ తులసి మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ ఆశాజ్యోతి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ధవళగిరిపై ఆధ్యాత్మిక శోభ

- నేడు రథోత్సవం, జనార్దనస్వామి కల్యాణం
- విస్తృత ఏర్పాట్లు



ధవళేశ్వరంలో కొలువైన శ్రీలక్ష్మీ జనార్దనస్వామి

ధవళేశ్వరం: గ్రామంలోని ధవళగిరిపై కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీజనార్దనస్వామి కల్యాణం మంగళవారం రాత్రి 9 గంటలకు అంగరంగ వైభవంగా జరగనుంది. అంతకుముందు తెల్లవారుజామున 3 గంటలకు విశేష అర్చనలు నిర్వహిస్తారు. ఉదయం 11 గంటలకు రథ సంప్రోక్షణ చేసి, మధ్యాహ్నం 3.30 గంటలకు స్వామివారి రథోత్సవాన్ని ప్రారంభించనున్నారు. రథం వీధి నుంచి ప్రారంభమయ్యే రథోత్సవం స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్ వరకూ సాగనుంది. ఈనెల 25వ తేదీ వరకూ స్వామివారి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. రథోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి వేలమంది హాజరుకానున్నారు. సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణ, అంకురార్పణ, వాస్తుపూజ నిర్వహిస్తారు. స్వామివారి కొండ దిగువ నుంచి ప్రారంభమయ్యే రథోత్సవం స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్ వరకూ జరుగుతుంది. స్వామివారి కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.సురేష్ తెలిపారు.

ధవళగిరి ముస్తాబు

జనార్దనస్వామి కల్యాణానికి ధవళగిరి ముస్తాబైంది. విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. స్థానిక రామపాదాల క్షేత్రంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు పర్యవేక్షిస్తున్నారు. మామిడి తోరణాలు, అరటి చెట్లతో ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు.

1890లో పాల్గొన్న టంగుటూరి

1890లో జరిగిన రథోత్సవంలో విద్యార్థిగా ఉన్న ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు పాల్గొన్నారు. ఈ సంఘటనలను మహాకవి చిలకమర్తి లక్ష్మీనరసింహపంతులు పద్యరూపంలో వర్ణించారు. దీనిని వివరిస్తూ ఆలయం దిగువన శిలాఫలకాన్ని సైతం ఏర్పాటు చేశారు.

భారీ బందోబస్తు

స్వామివారి కల్యాణోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మఫ్టీలో పోలీసులు ఉంటారని సీఐ వినయ్ మోహన్ తెలిపారు. ఆకతాయిలను ఉపేక్షించేది లేదన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జాతీయ రహదారి మీదుగా వాహనాలను మళ్లిస్తామన్నారు.

అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదగాలి

సినీ నటుడు ఆలీ, ఎంపీ భరత్‌రామ్



బ్యాటింగ్ చేస్తున్న సినీనటుడు ఆలీ, చిత్రంలో ఎంపీ భరత్‌రామ్

ప్రకాశం నగర్: అంతర్జాతీయస్థాయికి క్రీడాకారులు ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుడు, సినీ నటుడు ఆలీ, ఎంపీ మార్గాని భరత్ రామ్‌లు ఆకాంక్షించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన రాజమండ్రి ప్రీమియర్ లీగ్ (ఆర్పీఎల్)ను సోమవారం వారు ప్రారంభించారు. ముందుగా ఆలీకి ఎంపీ భరత్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ పార్లమెంటు కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ఇప్పటికే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఖేలో ఇండియా నిధులు రూ.20 కోట్లతో ఇండోర్ స్టేడియం వచ్చిందన్నారు. నగరంలో కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక ఇండోర్ స్టేడియం, ఒక క్రికెట్ స్టేడియం తీసుకురానున్నట్టు తెలిపారు. అంతకుముందు ఆలీ టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కొద్దిసేపు ఎంపీ భరత్, ఆలీ బ్యాటింగ్ చేసి సందడి చేశారు. కార్యక్రమంలో ఆర్పీఎల్ నిర్వాహకులు, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, నక్కా శ్రీనగేష్, మజ్జి అప్పారావు పాల్గొన్నారు.

పిల్లల్లో క్రీడాసక్తిని ప్రోత్సహిస్తే ఉత్తమ ఫలితాలు



వెయిట్ లిఫ్టింగ్ విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్

సీటీఆర్ఐ: పిల్లల్లో క్రీడల పట్ల ఉన్న అభిరుచిని గుర్తించి, ప్రోత్సాహం అందిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్ అన్నారు. పాట్నాలో ఈనెల 13 నుంచి 16 వరకూ జరిగిన 67వ జాతీయ స్కూల్ గేమ్స్ 2023 –24లో వెయిట్ లిఫ్టింగ్‌లో అక్కాచెల్లెళ్లు కారంగి హేమశ్రీ, కారంగి తరంగణి ప్రతిభ చూపారు. సోమవారం కలెక్టరేట్‌లో తమకు కలిసిన వారిని కలెక్టర్, ఎస్పీ అభినందించారు. హేమశ్రీ వెయిట్ లిఫ్టింగ్ 49 కేజీ కేటగిరీలో గోల్డ్ మెడల్, తరంగణి 55 కేజీల కేటగిరీలో సిల్వర్ మెడల్ సాధించారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇటీవలే ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను ఘనంగా నిర్వహించిందన్నారు. ఆ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు సత్యనారాయణ, కృపావతి, కోచ్ భాస్కరరావును అభినందించారు.

జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శ

మధురపూడి: కోరుకొండ మండలం కోటి గ్రామంలో పలువురిని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి సోమవారం పరామర్శించారు. ఇటీవల ప్రమాదంలో గాయపడిన పేపకాయల కిషోర్, సుంకర లక్ష్మణరావు, నందూరి సత్యనారాయణ, మండపల్లి సత్తిపండును పరామర్శించారు. ఆ గ్రామంలో ఇటీవల మృతి చెందిన రామారావు, నాగమణి, మంగయమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె వెంట గ్రామ సర్పంచ్ వెంటపాటి దుర్గారావు, ఎంపీటీసీ గట్టి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు అడపా హరిబాబు, సీతా వెంకటేశ్వరరావు, రాయిపాటి స్వామి పాల్గొన్నారు.